నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం
21 మే 2025 పేజీలు : 08



## అనధికార నిర్మాణాలకు

# నోటీసులు జారీ చేయండి

### కమిషనర్ వైఓ నందన్





**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనధికారంగా నిర్మాణం అవుతున్న భవనాలకు నోటీసులు జారీ చేసి ఛార్జ్‌షీట్ ఫైల్ చేయాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక వనంతోపు, భక్త వత్సల నగర్, కరెంట్ ఆఫీస్ కూడలి తదితర ప్రాంతాలలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. డివిజన్ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో నూతన డ్రైను కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణానికి అంచనాలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ సూచించారు. రోడ్లను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలను చేపట్టవద్దని, అనధికార నిర్మాణాలను తప్పనిసరిగా కూల్చి వేస్తామని కమిషనర్ హెచ్చరించారు. డ్రైను కాలువలను ఆక్రమిస్తూ చేపట్టిన ర్యాంపులు, మెట్ల నిర్మాణాలను తొలగించి అవసరమైనచోట సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జి సీటీ ప్లానర్ హిమబిందు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

## యోగాను సాధన చేస్తే..

# సంపూర్ణ ఆరోగ్యం








### జిల్లా కలెక్టర్ ఆనంద్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

శ్వాసపై ధ్యాసతో యోగాను సాధన చేస్తే ఆసుపత్రులకు వెళ్ళనవసరం లేని ఆరోగ్యకర జీవితం సొంతమవుతుందని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ఉదయం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన మెగా యోగా సాధనలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మన రాష్ట్రంలోని విశాఖకు వస్తున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా యోగపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శుల ఆదేశాల మేరకు జిల్లాలో రాబోయే నెల రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యోగాను నిత్యం సాధన చేస్తే ఆసుపత్రులకు వెళ్లవలసిన అవసరం తగ్గుతుందన్నారు. అందరి జీవితాల్లో యోగా భాగమవ్వాలన్నారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో యోగ కార్యక్రమాలు నిర్వహించాలని, వీలైనంత ఎక్కువ మందికి అవగాహన

-మిగతా 2లో

# గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం



- బెల్ట్‌షాపుల నిర్వహణతో మహిళలు ఇక్కట్లు
- అధికారుల కనుసనల్లోనే జరుగుతుందన్న ఆరోపణ
- పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు


**సైదాపురం, మేజర్‌న్యూస్ :**

సైదాపురం, మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు ప్రభుత్వ నిబంధనలు పటాపంచలు చేస్తూ.. అమ్మకాల పట్ల మహిళలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 6 గంటల మొదలు అర్ధరాత్రి 12 గంటలు దాటినా.. మద్యం సీసాలు లభిస్తుండటం వల్ల ఏరులై పారుతోందని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతితో నడిచే వైన్‌షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే ఓపెన్ కావాలి. అయితే బెల్ట్‌షాపుల్లో మాత్రం హెచ్చరికలకు చోటే లేదు. కొంతమంది కిరాణా పేరుతో బోర్డు పెట్టుకుని లోపల మద్యం దుకాణం నడిపిస్తున్నారు. 'ఏటీఎం దాకా నడుచుకుంటూ వెళ్లినట్టు.. తలుపు తట్టి సీసా పట్టుకొచ్చేస్తున్నారు' అని కొందరు మహిళలు తమ వేదన బయట పెట్టారు. వైన్‌షాపు యజమానులు సిండికేట్‌గా ఏర్పడి, ప్రాంతాల వారీగా బెల్ట్‌లను పంచేసు కున్నారని ఆరోపించారు. ఒక్కో బ్రాండుపై బెల్ట్‌కు ఇచ్చే రేట్లపై రూ.10 అదనంగా, అదే సీసా బెల్ట్‌షాపుల్లో రూ.20

-మిగతా 2లో

## టీడీపీ మహానాడు కీలక కమిటీల్లో

# సభ్యులుగా ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

తెలుగుదేశం పార్టీ ఈనెల 27 నుంచి కడపలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడులో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌కు అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. మంత్రి నారా లోకేష్ కన్వీనర్‌గా 12 మందితో కూడిన సమన్వయ కమిటీలో సభ్యులుగా ఎంపీ వేమిరెడ్డిని ఎన్నుకుంది. అలాగే ఆర్థిక వనరుల కమిటీ మెంబర్‌గా మరో కమిటీలో స్థానం కల్పించింది. ఈ మేరకు తెలుగు దేశం పార్టీ అధిష్టానం మహానాడుకు సంబంధించిన వివిధ కమి టీలను ప్రకటించింది. మహానాడు అంతటినీ సమన్వయం చేసుకోవడం, మహానాడుకు ఆర్థిక వనరుల మద్దతు వంటి అంశాలను ఈ కమిటీలు చూస్తాయి.

# ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాలు బేఖాతరు








- ఇందుకూరుపేటలో యధేచ్ఛగా రాజమార్గంలో అక్రమ మట్టి రవాణా
- పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు
- ఈ విషయం పరిశీలిస్తా ఇంచార్జ్ ఎంపీడీవో
- తనకు సంబంధం లేదు.. నా పరిధిలో లేదు : పంచాయతీ సెక్రెటరీ

**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఎన్ఆర్‌జిఎస్ ద్వారా కాల్వలను తవ్వి పూడికతో వచ్చిన మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా జేసీబీ ద్వారా ట్రాక్టర్ సహాయంతో తమ సొంత పొలంలోకి స్థానిక టీడీపీ నాయకులు, మరొక వ్యక్తి అక్రమంగా తరలిస్తున్నారని అక్కడి ప్రజల ద్వారా తెలిసింది. ఇటీవలే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పలుమార్లు హెచ్చరించిన విషయం ప్రస్తావించుకోవచ్చు. ఇక్కడ ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే మాట లెక్క చేయకుండా తూతూమంత్రంగా వ్యవహరిస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులకు తెలియకపోవడం గమనార్హం. పంచాయతీ సెక్రెటరీని 'మేజర్ న్యూస్' వివరణ కోరగా.. అది తన పరిధిలో లేదని, తనకు సంబంధం లేదని చెప్పడం గమనార్హం. ఇన్చార్జి ఎంపీడీవోని వివరణ అడగ్గా పరిశీలిస్తానని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మట్టి అక్రమంగా తరలిస్తున్న ప్రాంతానికి వెళ్లి చర్యలు తీసుకోవాల్సి ఉంది. పేదవాడు ఇలాంటి పని చేస్తే అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారనేది కూడా ప్రస్తావనగా చెప్పుకోవచ్చు. ధనికుడికి, అధికార దర్పం ఉన్నవారికి ఒకరకంగా.. పేదవాడికి మరో రకంగా కొంత మంది అధికారులు వ్యవహరించడం బాధాకరమైన విషయం. సేవా తత్పరురాలు, పేదల పెన్నిధి దాతృత్వం కలిగిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# టీడీపీతో బుచ్చిరెడ్డిపాళెంకు విడదీయరాని అనుబంధం ఉంది

**మహానాడు టీడీపీ కార్యకర్తలకు పండగలాంటిది**
**టీడీపీ ఎన్నికల గుర్తుగా సైకిల్ సింబల్ పెట్టమని సూచించింది బుచ్చిరెడ్డిపాళెం వాసి బెజవాడ పాపిరెడ్డిలే**
**చైర్‌పర్సన్ సుప్రజ మురళి**



**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** ఎంపీ, ఎమ్మెల్యేలుగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్న వేమిరెడ్డి దంపతులకు చైర్‌పర్సన్ సుప్రజ మురళి ధన్యవాదాలు తెలిపారు. కోవూరులో జరిగిన మిని మహానాడులో ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సంవత్సర కాలంలో ఐదేళ్ల అభివృద్ధికి పునాదులు వేసుకుంటూ ముందుకు పోతున్నారని కొనియాడారు. ప్రశాంతమ్మ ఎమ్మెల్యే అయ్యాక ప్రతిపక్ష నాయకులను విమర్శించడం, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టే సంస్కృతి కనుమరుగైందన్నారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక 20 ఏళ్ళుగా ప్రయత్నిస్తున్నా.. సాధ్యం కాని బుచ్చిరెడ్డిపాళెం ఆటోనగర్ నిర్మాణానికి గెలిచిన ఏడాదిలోనే సాధించారన్నారు. ప్రభుత్వ నిధులు అందుబాటులో లేకున్నా, తేజో డెవవ లపర్స్ అనే సంస్థ వారిని ఒప్పించి దాదాపు 2 కోట్ల రూపాయల సిఎస్ఆర్ నిధులతో మార్కెట్ నిర్మాణ పనులు చేయిస్తున్నారని తెలిపారు. రెండు వారల క్రితం పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం సందర్భంగా బుచ్చిరెడ్డి పాళెంలోని 7వ వార్డులో ఇళ్ల మధ్య నుంచి పోయే గుడిపల్లి కాలువలో చిన్న పిల్లలు పడిపోతున్నారని స్థానికులు ఎమ్మెల్యే మేడం దృష్టికి తెచ్చిన వెంటనే స్పందించి కాలువ పై గ్రిల్ ఏర్పాటు చేయించారన్నారు. ఖజానగర్లో 10 కల్వరట్ల నిర్మాణనికి ఎంపి లాడ్స్ ద్వారా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుచ్చి అభివృద్ధి కోసం పాటు పడుతున్నారని బుచ్చి పట్టణంలో తాగునీటి సమస్య తీర్చేందుకు 12 లక్షల 50 వేలతో 5 బోర్లు చేయించారని పేర్కొన్నారు. మరో 25 లక్షల సి ఎస్ ఆర్ నిధులతో కట్టుబడి పాళెంకు తాగు నీటి పైప్‌లైన్ నిర్మాణంతో పాటు బుచ్చి నగర పంచాయతిలో తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా 7 లక్షలు వెచ్చించి 11 స్పేర్ నీటి మోటార్లు అందుబాటులో వుంచారన్నారు.ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చొరవతో బుచ్చి పట్టణంలో రోడ్ల, డ్రైన్ల నిర్మాణం కోసం 2 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. అభివృద్ధి,యువతకు ఉపాధే లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఇప్పటి దాకా మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టె నాయకులను చూసాం కానీ ప్రజల కోసం పని చేసే నాయకులను వేమిరెడ్డి దంపతుల రూపంలో చూస్తున్నామన్నారు.

## ఆరికట్లకు మర్రిపాడులో ఘన సన్మానం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ధర్మదాయ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారధ్యంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఎంపికైన ఆరికట్ల జనార్ధన్ నాయుడును మంగళవారం మండలంలోని పలు గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు మర్రిపాడులోని ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మర్రిపాడు సారధ్య బాధ్యతలను భుజానికి ఎత్తుకొని మనోధైర్యం నింపి క్రమశిక్షణగా నాయకుడిగా మండలంలో గుర్తింపు పొందాడు. ఈయన కష్టం తగ్గ ఫలితం ఇవ్వాలని ఆనం దృష్టిలో పెట్టుకొని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. మర్రిపాడు మాజీ ఎంపీపీలు కటారి రమణయ్య, బంక సుబ్బారెడ్డిలతోపాటు టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రూరల్ మండలంలో పలు సచివాలయాలు తనిఖీ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.శైలేంద్ర కుమార్ నెల్లూరు రూరల్ మండలంలోని వెల్లంటి, గొల్లకందుకూరు, ములుమూడి సచివాలయాలను తనిఖీ చేసినారు. అనంతరం కొత్త వెల్లంటి గ్రామ పంచాయతీలో వివిధ సమస్యలపై చర్చించారు. అలాగే వివిధ ప్రభుత్వ సర్వేల పురోగతిపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు, సచివాల య సిబ్బందికి 100 శాతం పురోగతి సాధించుటకు తగు సూచనలు జారీ చేసినారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా అధికారులు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యోగాను సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం

*(మొదటి పేజీ తరువాయి)*

కలిగించేందుకు కృషి చేయాలన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున ప్రారంభించాక జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో యోగ సాధనపై అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా రాబోయే నెల రోజులు ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ తయారు చేసుకొని ప్రతి గ్రామంలో యోగ సాధన చేసేవిధంగా అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థులు, వాకర్ క్లబ్ సభ్యులు తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్ యోగాసనాలు చేశారు. ప్రాణాయామం, నాడీ సాధన, భుజంగాసనం, శలభాసనం తదితర ఆసనాలను విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆనంద్ ఉత్సాహంగా చేశారు. చివరగా నయాగ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలైన చిన్నారులకు జిల్లా కలెక్టర్ మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డిఎస్‌డిఓ యతిరాజ్, సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు, కార్యక్రమ నిర్వాహక ప్రతినిధులు విగ్నేష్, విజయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం



*(మొదటి పేజీ తరువాయి)*

ఎక్కువకు అమ్ముతున్నారు. మొత్తం మీద ఎమ్మార్పీ కంటే 30 రూపాయలు అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారని, ఫలితంగా మందుబాబుల జేబులు ఖాళీ కావడమే కాకుండా.. ఇళ్లలో కుటుంబ కలహాలు కోలాహలం జరుగుతోందని పలువురు వాపోతున్నారు.

**అధికారులు మౌనమే ఆయుధమా ?**

'అన్ని గ్రామాల్లో లక్షల్లో లావాదేవీలు జరుగుతున్నాయి. ఎక్సైజ్, పోలీస్ అధికారులు కళ్లారా చూసినా.. స్పందన ఎందుకు లేదు ?' అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో కుటుంబ సంస్కృతికి మద్యం చిచ్చుపెడుతోందని, యావత్ యువత మారాలంటే చట్టాలు కఠినంగా అమలు చేయాల్సిందేనని గ్రామస్తులు గళమెత్తారు. బెల్ట్‌షాపులు మూసి వేయిస్తే, కనీసం కొన్ని కుటుంబాలు నిలదొక్కుకుంటాయని గ్రామస్తుల ఆక్రందన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్ట్ షాపుల నిర్వహకులపై తగిన చర్యలు తీసుకోవాలని మండలంలోని మహిళలు వేడుకుంటున్నారు.

## జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా నెల్లూరు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నోవా బ్లడ్ బ్యాంకులో 50 మంది నందమూరి తారకరామారావు ఫ్యాన్స్ రక్తదానం చేశారు. అనంతరం విశ్వజనని బాలల ఆశ్రమంలో కేక్ కటింగ్, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ నేతలు సుభాష్ గుప్తా, తారక్ గంగాధర్, హరి, సుధా, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** గుర్రం జాషువా గ్రంథాలయ భవన పునర్నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని గుర్రం జాషువా కమిటీ సభ్యులు మంగళవారం కమిషనర్ వైవో నందన్‌కు వినతి పత్రం అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ ఈ నెల 24న తప్పనిసరిగా గుర్రం జాషువా గ్రంథాలయానికి వస్తానని, సమస్యలన్నింటికీ పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గుర్రం జాషువా గ్రంథాలయం వర్కింగ్ ప్రెసిడెంట్ యస్‌కె.ఖాసిం, కొమ్మల కృష్ణయ్య, జనార్ధన్, జివి కృష్ణయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు.

# కార్మిక కోడ్‌లు రద్దుచేయాలి : సీఐటీయు




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కార్మిక కోడ్‌లను రద్దుచేయాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని తదితర డిమాండ్లతో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరులో పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ డిమాండ్ల సాధనకోసం మంగళవారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జూలైకు వాయిదా వేయగా ఈ కార్యక్రమంలో భాగంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ డిపోవద్ద నుండి ఎల్ఆర్ పల్లి, సోమశిలరోడ్డు సెంటర్, బిఎస్ఆర్ సెంటర్, జెఆర్‌పేటలమీదుగా వందలాదిమంది సిఐటియు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ బస్టాండువరకు బ్యానర్లు, ప్లకార్డులు చేతబూని నినాదాలుచేస్తూ ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె కార్యక్రమంలో భాగంగా సిఐటియు నాయకులు, అనుబంధ సంఘాలైన అంగన్‌వాడీలు, విఆర్వోలు, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ కార్మిక తదితర సంఘాల నాయకులు, కార్మికులు, వివిద సంస్థల్లో పనిచేసే కార్మికులు తదితరులు నాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు జి.వి.శివప్రసాద్, కొండమూరు హజరత్తయ్య తదితరులు ప్రసంగించారు. బిజెపి ప్రభుత్వం 3వ దపా అధికారంలోకి వచ్చిన తరువాత తమ బలం గణనీయంగా తగ్గినా ప్రవేటీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తుందని, కార్మికవర్గానికి ఇబ్బంది కల్గించేలా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4లేబర్‌కోడ్‌లను అమలులోకి తెచ్చారని, ఈకోడ్‌లను రద్దు చేయాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గం నేడు అనుభవిస్తున్న చట్టాలు బ్రిటిష్‌కాలంనాటి విధానాలు కాగా అనేక పోరాటాలద్వారా సాధించుకున్నవని వారు తెలిపారు. వేతన కోడ్‌లో జాతీయ కనీస వేతనం రోజుకు 178 రూపాయలుగా నిర్ణయించారని, పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచకుండా శ్రమదోపిడీ జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన అసమానతలు పెరిగిపోయాయని, 50శాతం ప్రజలు కేవలం 3శాతం ధనవంతులుగా ఉండగా 70శాతం వారివద్ద ఉందన్నారు. పేదరికం, పోషకాహారలోపం, నిరుద్యోగం, ఉపాధిలేమి, మహిళలపై హింస విపరీతంగా పెరిగాయన్నారు. ఐసిడిఎస్ ఏర్పడి 50సంవత్సరాలు పూర్తయినా నేటికీ ప్రభుత్వ ఉద్యోగులుగా కానీ, కనీసం కార్మికులుగా కూడా గుర్తించలేదన్నారు. తమ పోరాటాల ఫలితంగా 2022లో సుప్రీమ్‌కోర్టు అంగన్వాడీలకు గ్రాట్యుటి అమలు చేయాలని ఇచ్చిన తీర్పు అమలు కాలేదన్నారు. మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అంగన్వాడీలను నిర్లక్ష్యం చేస్తున్న ఈతరుణంలో నిత్యావసర సరుకుల ధరలు, కరెంట్‌చార్జీలు, గ్యాస్‌ధరలు పెరిగాయని, పనిభారం కూడా పెరిగిందని, 2019 నుండి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని, 42రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024లో అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చినా ప్రభుత్వం అమలు చేయలేదని వారు తెలిపారు. అన్నియాప్‌లు కలిపి ఒకే యాప్ చేస్తామని, కొత్తగా తెచ్చిన బాలసంజీవని యాప్‌ల వలన అంగన్‌వాడీలు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని, ఈనేపద్యంలో కార్మికవ్యతిరేకకోడ్‌లకు వ్యతిరేకంగా పలు సమస్యలు పరిష్కారంచేయాలని, కార్మికకోడ్‌లను రద్దుచేయాలని, ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యుటి అమలు చేయాలని, కనీసవేతనం 26వేల రూపాయలు చెల్లించాలని, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, రైల్వే, విద్యుత్, స్టీల్, బ్యాంక్, ఇన్సూరెన్స్ తదితర రంగాల్లో ప్రవేటీకరణ విధానాలు ఆపాలని, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్, అగ్నిపథ్ స్కీమ్‌లను రద్దుచేయాలని, గ్రామీణ ఉపాధిహామీ పథకంకు బడ్జెట్‌పెంచి 200రోజుల పనిదినాలు కల్పించాలని, ఈస్కీమ్‌ను పట్టణాలకు వర్తింపజేయాలని, అంగన్‌వాడీ మినీవర్కర్లను మెయిన్‌గా గుర్తించాలని, అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, యాప్‌ల పనిభారం తగ్గించాలని, సార్వత్రిక సర్వేలో ప్రభుత్వ ఉద్యోగి అనే పదం తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి.వి.శివప్రసాద్, మండల అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, ప్రధానకార్యదర్శి కొండమూరు హజరత్తయ్య, రైతుసంఘ జిల్లా నాయకుడు జి.లక్ష్మిపతి, సిఐటియు ఉపాధ్యక్షుడు కె.డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ షేక్ సంధాని, యుటిఎఫ్ జిల్లా నాయకులు బి.శివప్రసాద్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు జి.నరశింహులు, అంగన్‌వాడీవర్కర్స్‌అండ్‌హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ ప్రధానకార్యదర్శి పి.రాధ, ఆశావర్కర్స్ యూనియన్ కార్యదర్శి బి.రమణమ్మ, మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ కార్యదర్శి జి.నాగేంద్ర, ఎల్ఐసి ఉద్యోగులసంఘ నాయకుడు టి.రమేష్, యుఈఈయు నాయకుడు ఏ.మహేష్, పలువురు నాయకులు, కార్మికులు, అధికంగా మహిళానాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలపట్ల వివక్ష తగదు : సీడీపీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బాలికలపట్ల ఎలాంటి వివక్ష తగదని, అందుకు తల్లిదండ్రులు కూడా తమవంతుగా బాలికలకు సమానప్రాధాన్యత ఇవ్వాలని ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొ న్నారు. కిశోరవికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆత్మకూరు మండలం బి.చిరువెళ్ళ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఎన్.కేశవనారాయణమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత అతిధిగా పాల్గొని ప్రసంగించారు. కిషోరవికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అఇంగబేధం అనే అంశం పట్ల అందరికీ అవగాహన కల్పించేలా ఈకార్యక్రమం నిర్వహించారు. బాలురు, బాలికలు సమానం అన్న భావనతో చూడాలన్నారు. పురుషాధిక్యసమాజం పోవాలని, మహిళాసాధికారిత సాధించాలన్న లక్ష్యంగా బాలికల నుండి మహిళల వరకు అనేక విదాలుగా ప్రాధాన్యత ఇస్తూ పౌష్టికాహారం, విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని, బాలికలకు ప్రత్యేక పాఠశాలలు, వసతి గృహాలు ఏర్పాటు చేశారని ఆమె పేర్కొన్నారు. అన్నింటిని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాలికలపట్ల ఎలాంటి వివక్షలేకుండేలా సమానత్వం పాటించాలని, సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సునీలత సూచించారు. కిశోరబాలికలు తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించి అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని కిశోరబాలికలకు తగిన అవగాహన కల్పించాలని బాలలహక్కుల పరిరక్షణ, పివోసిస్ చట్టం, లింగబేధం గురించి ఆమె వివరించారు. కిశోరవికాసం కార్యక్రమం మే2వతేదీ ప్రారంబించి జూన్10వతేదీ వరకు నిర్వహించాల్సి ఉందని, గ్రామాల్లో ఈ కార్యక్రమం గురించి విస్తృతంగా ప్రచారం గావించి కిశోరబాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూపర్‌వైజర్ నారాయణమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలను కోరారు. అందులోభాగంగా లింగబేధం గురించి వివరించామన్నారు. కిషోరబాలికలు, వారి తల్లిదండ్రులు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, భద్రత, రక్షణ, హక్కులు, తదితర అంశాలపట్ల అవగాహన పెంపొందించుకోవాలని నారాయణమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.దేవసేనమ్మ, కృష్ణకుమారి, దొరసానమ్మ, ఆశాకార్యకర్త, కిషోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ రవీంద్రబాబు మృతి అత్యంత విచారకరం



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** మండలంలో ఓ దినపత్రిక జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న రవీంద్రబాబు సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి అత్యంత విచారకరమని స్తానిక మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపిన విక్రమ్‌రెడ్డి తమవంతుగా రవీంద్రబాబు కుటుంబానికి 50వేల రూపాయలు ఇవ్వగా ఆమొత్తాన్ని స్థానిక వైసీపీ నాయకులు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్‌జర్నలిస్ట్స్ నెల్లూరు జిల్లా ప్రధానకార్యదర్శి సిహెచ్ మస్తాన్‌రెడ్డి తదితరులు మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ.. అత్యంత సౌమ్యుడు, సీనియర్ జర్నలిస్ట్‌గా సేవలందించిన రవీంద్రబాబు మృతి తీరనిలోటు, అత్యంత బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# నీలం మల్లికార్జున యాదవ్‌కుకు ఆత్మీయ సన్మానం




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్‌కు ఆత్మీయ సన్మానం జరిగింది. సంస్థల ప్రతినిధులు హాజరై ఈ కార్యక్రమాన్ని చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు సాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు. స్వచ్ఛంద సంస్థల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మండల పార్టీ అధ్యక్షులకు తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమం గురించి పార్టీ అధ్యక్షులు మాట్లాడారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆశీస్సులతో పార్టీ కార్యకర్తలు నాయకులు సహకారంతో పార్టీ అధ్యక్ష పదవి పొందినట్లు తెలిపారు. అందరి సహకారం కొనసాగాలని పార్టీ అధ్యక్షులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పార్టీ కార్యకర్తల సంక్షేమం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని పార్టీ అధ్యక్షులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో 22న టీడీపీ మినీ మహానాడు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఈనెల 22న నిర్వహించనున్న తెలుగుదేశం మినీ మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆత్మకూరు మున్సిపాలిటీ, ఆత్మకూరు, ఏఎస్ పేట, మర్రిపాడు, అనంతసాగరం, చేజర్ల, సంగం మండలాల నుండి టీడీపీ శ్రేణులంతా తరలివచ్చి కార్యక్రమంను విజయవంతం చేయాలని ఆత్మకూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చంద్రా రెడ్డి తదితరులు పిలుపునిచ్చారు. కార్యక్రమం ఏర్పాట్లు, కమిటీలు గురించి చర్చించేందుకు మంగళవారం సమావేశ మయ్యారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచన మేరకు ఆయన సారద్యంలో ఆత్మకూరులో నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం మినీ మహానాడు ఈనెల 22వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:30 గంటల వరకు స్థానిక రవితేజ కళ్యాణ మండపం వేదికగా జరుగుతుందన్నారు. ఆత్మకూరు పట్టణ కమిటీ కొరకు సీనియర్ నాయకుల, వార్డ్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు దగ్గర సూచనలు, విజ్ఞప్తులు, పేర్లు కొరకు ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు సమావేశం ఏర్పాటు చేసి సూచనలు, విజ్ఞప్తులు తీసుకున్నారు. అలాగే మినీ మహానాడు విజయవంతం చేయాలని ఆత్మకూరు పట్టణ నాయకులు కోరారు. మినీ మహానాడు నందు ఆత్మకూరు పట్టణ పరిధిలోని అందరూ బూత్ స్థాయి, యూనిట్ స్థాయి, క్లస్టర్ స్థాయి, కన్వీనర్లు, కో కన్వీనర్లు, కుటుంబ సాధికార సారథులు, గ్రామ, వార్డు మండల స్థాయి కార్యవర్గం, తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యులు అందరూ విధిగా హాజరు కావలసిందిగా, సదరు మినీ మహానాడులో పాల్గొనే నేతలు, కార్యకర్తలు తప్పనిసరిగా తెలుగుదేశం పార్టీ 2024-26 సభ్యత్వం గుర్తింపు కార్డుతో పాటు పసుపు రంగు షర్టు ధరించి పాల్గొనాలని ఆత్మకూరు పట్టణ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లోమున్సిపల్ చైర్మన్ గోపారం వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, కౌన్సిలర్లు సూరా భాస్కర్ రెడ్డి, గౌస్ బాషా, శివకోటారెడ్డి, తెలుగుదేశం నాయకులు పులిమి శైలజా రెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి, పల్లవోలు జయాకర్, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తోడేటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాగిత కళాకృతుల తయారీ




**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు కాగిత కళాకృతులు తయారు చేశారు. ఈ తయారీ కార్యక్రమానికి శిక్షకులుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు గండికోట సుధీర్ కుమార్, తాటిపర్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాగిత కళాకృతులు పిల్లలు తయారు చేయడం వలన సృజన, ఏకాగ్రత, నైపుణ్యం అలవాడతాయన్నారు. పిల్లలలోని కళలను ప్రోత్సహించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ధైర్య సాహసాలకు ప్రతీక, నిరాడంబరత్వానికి నిలువుటద్దం, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కే.మంజులత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వేదగిరి లక్ష్మి నరసింహ స్వామి హుండీ లెక్కింపు

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వేంచేసి యున్న వేదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నందు దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ, ఉత్సవ కమిటి చైర్మన్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం రాత్రి వరకు జరుగగా మొత్తం రూ.13,30,449/-లు వచ్చినట్లు వారు తెలిపారు. ప్రధాన హుండీల ద్వారా రూ.10,78,070/-లు, అన్నదానం హుండీ ద్వారా రూ.14,134/-లు, తాత్కాలిక హుండీల ద్వారా రూ.1,56,665/-లు, కొండి కాసుల హుండీ ద్వారా రూ.81,580/-లు ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి, ఉత్సవ కమిటి చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి కుడారి పెంచల వరప్రసాద్, ఉత్సవ కమిటి చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్ రెడ్డి, ముత్తం శెట్టి శీనయ్య, చెరుకూరు సింహాద్రి, పురిణి సరస్వతి, తోడేటి కామాక్షమ్మ, మడపాకుల జయమ్మ, కొత్తకోట కవిత,



డబ్బుగుంట కృష్ణయ్య, సండి మురళీ యాదవ్, కందుకూరు శ్రావణి, బెళ్ళు శ్రీనివాసులు రెడ్డి, రిటైర్డ్ బ్యాంకు సిబ్బంది, జొన్నవాడ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కోరిడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో..

# ఉచిత వైద్య శిబిరం




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో కోరిడ్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో పనిచేయుచున్న కోరిడ్ సంస్థ వాలంటీర్లకు, గ్రామ ప్రజలకు ఉచితంగా నిపుణులైన వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, అవసరమైన వారికి ఉచితముగా మందులు పంపిణీ చేశారు. ఈ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రావేల జైపాల్ మాట్లాడుతూ.. కావలి చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందని, అలాగే ప్రతి గ్రామంలో నెలకి రెండుసార్లు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ సూపర్వైజర్ దంతం సునీల్, వాలంటీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

అదాని వరల్డ్ స్కూల్‌లోని సైనిక్

# ఎన్‌సీసీ క్యాడెట్లకు పతకాలు, పదోన్నతులు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** 24 ఆంధ్ర బెటాలియన్ శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. శిబిరంలో క్యాడెట్లకు క్రమశిక్షణ, నాయకత్వం, పౌర సమాజ బాధ్యతలపై అవగాహన కల్పించడంతో పాటు, క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా



క్యాంప్ కమాండెంట్ కల్నల్ డి.కరంచంద్ మంగళవారం మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణ అనేది విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణను సమాజం పట్ల సేవా భావాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది' అన్నారు. కాడేట్ శ్రీరామ్‌కు ప్రత్యేకంగా సార్జెంట్ హోదా లభించిందన్నారు. కాడేట్ అసువినేష్ కు కార్పొరల్, కాడేట్ సంజీవ్, నేహాశ్రీక్షిత, వైష్ణవిలకు లాన్స్ కార్పొరల్‌గా పదోన్నతులందుకున్నారు. వైష్ణవి ఉత్తమ షూటర్‌గా, శ్రీరామ్ ఉత్తమ క్యాడెట్‌గా, నేహాశ్రీక్షితకు ఉత్తమ బృంద నాయకురాలిగా ఎంపికై పతకాలు అందుకున్నారు. ఈ శిబిరాన్ని ప్రశంసిస్తూ సైనిక్ క్యాడెట్లను ఆదానీ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్ శర్మ ప్రత్యేకంగా అభినందించారు. 'కీప్ లెర్నింగ్, కీప్ గ్రోయింగ్ టూగెథెర్' అన్న నినాదంతో ఈ శిబిరం ముగిసింది. క్యాడెట్లందరికీ తల్లీ దండ్రులు అడ్మిన్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నగరంలోని మూలాపేట, ఇసనాకుల కామయ్య వీధి, చెప్పండివారి తోట ప్రాంతంలో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో, ఈ 21వ తేదీ నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాండురంగ స్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి భక్త బృందం, ఇసనాకుల మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 24వ తేదీ వరకు శాస్త్రక్తంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణపతి పూజ, స్వస్తి పుణ్యవచనం, కంకణ ధారణ, అఖండ దీప స్థాపన, అంకురార్పణం, అన్న ప్రసాద వితరణ, సత్యనారాయణ వ్రతం, రుద్ర హెూమం, మహా పూర్ణహృతి, శాంతి కళ్యాణ మహెూత్సవం, పల్లకి సేవ, ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు ఉత్సవాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దైవ దర్శనం పొంది, తీర్థప్రసాదాలు స్వీకరించాలని పిలుపునిచ్చారు.

బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో

# వసతులు లేక ప్రయాణికుల అవస్థలు

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో కనీస వసతులు లేక ప్రయాణికుల అవస్థలు ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్-2లో ప్రయాణికులు కూర్చోటానికి బెంచీలు లేక విరిగిన వాటిపై కూర్చుంటున్నారు. మరికొందరు నేలపై, చెక్కలపై గార్డ్‌లు లోక్ పైలట్ లగేజ్ బాక్స్‌ల మీద కూర్చుంటున్నారు.



రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ప్లాట్ ఫామ్‌పై కనీస వసతులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ట్యాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యత కల్పించండి

**కమిషనర్ వై.ఓ నందన్**



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు, నగర వ్యాప్తంగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవసరమైన నిధులను పన్నుల ద్వారా సేకరించిన మొత్తాల నుంచే కేటాయించగలమని, కావున ట్యాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని కమిషనర్ వై.ఓ నందన్ రెవెన్యూ అధికారులు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. రెవెన్యూశాఖ వారాంతపు సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన ఉత్తర్వుల మేరకు ప్రతి అడ్మిన్ కార్యదర్శి సచివాలయ ఇతర కార్యదర్శులను సమన్వయం చేసుకుని ఇంటింటి ట్యాక్స్ రివిజన్ సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అదనంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ల నియామకం చేపట్టామని తెలిపారు. అడ్మిన్ కార్యదర్శులు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పన్నుల సవరణల సర్వేను పూర్తి చేయాలని, రెవెన్యూ వసూళ్లను గత ఆర్థిక సంవత్సరం కన్నా అదనంగా 20శాతం డిమాండ్ పెంచాలని సూచించారు. సచివాలయాల మేరకు నిర్దేశించిన సర్వే రివిజన్ లక్ష్యాలను అడ్మిన్ కార్యదర్శుల ద్వారా పూర్తి చేయించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సర్వే రివిజన్ వంద శాతం పూర్తయ్యేందుకు వీలుగా అడ్మిన్ కార్యదర్శులకు సచివాలయాల వారీగా బదిలీలను చేపట్టనున్నామని కమిషనర్ తెలిపారు. రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు, విధులలో మెరుగైన పనితీరు కనబరచని వారు, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలలో అలసత్వం వహించిన కార్యదర్శులపై శాఖా పరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన మాలేపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ కావలి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పార్టీ మాలేపాటి సుబ్బానాయుడుకి ఆంధ్రప్రదేశ్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ పదవి నారా చంద్రబాబు నాయుడు ఇవ్వడం జరిగింది. అనంతరం మలేపాటి మాట్లాడుతూ.. గతంలోనేను పార్టీకి అందించిన సేవలను గుర్తించి నాకు నామినేటెడ్ పోస్ట్ ను ఇవ్వడం జరిగిందని, అలాగే తెలుగుదేశం పార్టీ కష్టపడిన నాయకులకు, కార్యకర్తలను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో చెప్పిన విధంగా, రాష్ట్రంలో కష్టపడ్డ ప్రతి నాయకునికి కార్యకర్తకి పదవులు ఇవ్వడం నాయకుల్ని కార్యకర్తలని ప్రోత్సహించడమని మాలేపాటి తెలిపారు. అలాగే నా మీద నమ్మకం ఉంచి నాకు పదవీ బాధ్యతలు అప్పచెప్పిన పార్టీకి రుణపడి ఉంటానని, అలాగే నాసహచర మంత్రులు తెలుగుదేశం పార్టీ నాయకులకు, మిత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పార్టీని బలోపేతం చేసేందుకు నిరంతరము నేను, నా కుటుంబం పార్టీ కార్యకర్తలకి ఎల్లవేళలా తోడుంటానని ఈ సందర్భంగా తెలిపారు. గురువారం రోజున ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## మన్నవ అద్వైత్ చౌదరి జన్మదినం సందర్భంగా అన్నదానం




**కావలి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు ఆయన మనవ రవిచంద్ర మనుమడు అద్వైత్ చౌదరి జన్మదిన సందర్భంగా మంగళవారం కావలి అన్నా క్యాంటీన్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఉచితంగా పేదలకు అందించడం జరిగింది. ప్రతి సంవత్సరం తన మనవడు, మనవరాలు పుట్టినరోజు సందర్భంగా అన్నదానం వస్త్ర దాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తెలిపారు. ప్రతి సంవత్సరం పుట్టినరోజు నాడు ఆర్టీసీ బస్టాండ్ దగ్గర పేదలకు దుప్పట్లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కావలి పట్టణంలో ఎన్నో సంవత్సరం నుంచి పార్టీకి సేవలందిస్తున్న మన్నవ తను కుమారులు ఇతర దేశాల్లో ఉండి కూడా కావలి పై మమకారాన్ని పెంచుకుని జన్మదిన సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని, కావలి పట్టణ ప్రజలు వారి అభిమానులు తెలపడం విశేషం. ఈ కార్యక్రమంలో మన్నవ అభిమానులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిత్య అన్నదాన పథకానికి విరాళాలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండపై వేదగిరి క్షేత్రంగా పేరుగాంచిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుచున్న నిత్య అన్నదాన పథకంకు రూ.15,021లు విరాళాలు వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ వాస్తవ్యులు ఉడాలి భాస్కర్, పద్మావతి జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు సునీత రాఘవన్ దంపతులు రూ.10,001లు, సత్యవేడు వాస్తవ్యులు ముప్పాల నరసరాజు పద్మమ్మ దంపతులు రూ.5,020లు విరాళాలుగా ఇచ్చినట్లు ఆయన తెలిపారు. దాతలకు దర్శనం, స్వామివారి శేష వస్త్రము, ప్రసాదం అందజేశారు. ఇంకా భక్తులందరూ నిత్యాన్నదాన పథకంకు సహకరించి స్వామివారి అనుగ్రహంకు పాత్రులు కావలసినదిగా ఆహ్వానించారు.

# పూడికతీతకు జెన్ రోబోటిక్స్ మిషన్ పనితీరు పరిశీలన



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** మేజర్ మైనర్ డ్రైన్ కాలువలలో పూడికతీత పనుల కోసం రూపొందించిన నూతన మిషన్‌ను ప్రయోగాత్మకంగా ఉపయోగించి ఫలితాలను నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పరిశీలించారు. స్థానిక రామ్మూర్తి నగర్ ప్రాంతంలోని ప్రధాన డ్రైన్ కాలువకు జెన్ రోబోటిక్స్ మెషిన్ ను అనుసంధానించి పూడికతీత పనులను మంగళవారం చేపట్టారు. మిషన్ పనితీరును పరిశీలించిన కమిషనర్ డ్రైను కాలువల పూడికతీత కన్నా లోతైన బావులు, నూతుల నుంచి పూడికను తొలగించేందుకు ఈ మిషన్ అనువుగా ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గిట్టుబాటు వేతనం వచ్చేలా పనులు చేయాలి




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసే కూలీలు గిట్టుబాటు వేతలు వచ్చేలా పనులు చేయాలని ఏపీఓ సుభాషిని తెలిపారు. మంగళవారం ఊటుకూరు జువిగుంటపాలెం గ్రామాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఫారం ఫౌండ్స్ నీటి కుంటలు పశువులకు నీరు త్రాగేందుకు అవసరమైన కుంటలు ఏర్పాటు చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీకు ఉద్దేశించి మాట్లాడుతూ.. సకాలంలో పనులకు వచ్చి నిర్దేశించిన కొలతలు ప్రకారం పనులు చేయాలన్నారు. అప్పుడే తగిన కూలి వస్తుందని ఆమె తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున నేల తేమగా ఉందని పనులు చేయడానికి సులువుగా ఉంటుందన్నారు. కాబట్టి కూలీలు ఇచ్చిన కొలతలు ప్రకారం ముగించుకొని తగిన వేతనాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఫీల్డ్ సహాయకులు మల్లేశ్వరి ఉన్నారు.

## బ్యాంకు రుణాలతో స్వయం సమృద్ధి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం ద్వారా స్వయం సహాయక సభ్యులు బ్యాంకు రుణాలతో స్వయం సమృద్ధిని పొందగలరని కార్యాలయ సీసీ సుశీల అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఊటుకూరు క్లస్టర్ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ.. సంఘబంధ సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది తమ తమ జీవితాలకు అనుగుణంగా ఉపాధిని ఏర్పాటు చేసుకొని పెంపొందాలన్నారు. గేదెలు పెంపకం గాని జీవాల పెంపకం గాని చిల్లర దుకాణం కానీ ఏర్పాటు చేసుకొని తమ జీవనాన్ని మెరుగుపరుచుకోవాలని తెలిపారు. అలాగే రుణాలు పొందిన సభ్యులు సకాలంలో సక్రమంగా చెల్లించే విధంగా ఉండాలన్నారు. అప్పుడే బ్యాంకుల దృష్టిలో మన పరపతి బాగుంటుందన్నారు. భవిష్యత్తులో అధిక రుణాలు పొందేందుకు వీలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ లక్ష్మి కుమారి వివోఏ జయలక్ష్మి సిబ్బంది సువార్తమ్మ సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

# వైసీపీని బలోపేతం చేయడంలో జోరు పెంచిన ఆనం విజయకుమార్ రెడ్డి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని 28వ డివిజన్, 29వ డివిజన్ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో, నెల్లూరు రూరల్ నియోజకవర్గ చింతరెడ్డిపాళెంలోని నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి నివాసం నందు 28వ డివిజన్, 29వ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రతి ఒక్క వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో దృఢ సంకల్పంతో పార్టీ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరూ తమ సొంత భాధ్యతగా పని చేసి మనకు జగన్మోహన్ రెడ్డి ధైర్యం కాదు మనమే సమిష్టిగా జగన్మోహన్‌రెడ్డికి ఒక ధైర్యాన్ని అవుదామని తెలిపారు. అదేవిధంగా 2029లో మళ్ళీ వై.యస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని నాయకులకి తెలియపర్చారు. ప్రతీ నాయకుడికి ప్రతి కార్యకర్తకి అధికార పార్టీ వల్ల వచ్చే అన్ని సమస్యలపై అన్ని విధాలా పార్టీ పరంగా మీ కుటుంబ పెద్ద లాగా ఒక భాధ్యతగా అండగా ఉంటానని భరోసా కల్పించడం జరిగింది. ఈ సమావేశంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున 28వ డివిజన్ ఇంచార్జ్‌గా నెల్లూరు మదన్ మోహన్ రెడ్డి ని, 29వ డివిజన్ ఇంచార్జ్‌గా షేక్ జాకీర్ హుస్సేన్‌ని, స్థానిక నాయకుల, కార్యకర్తల అభీష్టం మేరకు వారి సలహా సూచనలు తీసుకుని డివిజన్ అధ్యక్షులుగా నియమించారు. అలాగే ప్రతి ఒక్క నాయకుడు, ప్రతి కార్యకర్త వై.ఎస్.ఆర్.సిపి పార్టీ బలోపేతానికి, వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా ఉండి మన పార్టీ గెలుపే లక్ష్యం గా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ సత్తార్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్ రావు,రాష్ట్ర అంగన్వాడి సెల్ కార్యదర్శి వెంకట్ జ్యోతి, రాష్ట్ర ఎస్సీ సెల్ బద్దెపూడి రవీంద్ర,రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి అబ్దుల్ సలీం, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ శ్యామ్ సింగ్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ, ఎంప్లాయస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు కనకట్ల మోహన్ రావు ముదిరాజ్, విద్యార్థి విభాగ అధ్యక్షుడు రోహిత్ రెడ్డి, 35వ డివిజన్ నాయకులు రంజిత్ కిరణ్, 22వ డివిజన్ నాయకులు జయంత్, 28వ డివిజన్ నాయకులు పులిపాటి వెంకట రమణయ్య, సురేష్ రెడ్డి, మల్లి, ఆనంద్, ప్రసాద్, అంకయ్య, శ్రీనివాసులు రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, గంగవరపు సుధాకర్, కృష్ణ, 29వ డివిజన్ నాయకులు రియాజ్, మస్తాన్, జుబేర్, ఖదీర్, ముజీబ్, ఆరిఫ్, సమీర్, అహ్మద్, నిసార్, 28, 29వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబంలో యోగ ఒక భాగం కావాలి : జిల్లా కలెక్టర్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవం సందర్భంగా నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో యోగా దినోత్సవంలో అఖిల భారత పద్మశాలి సంఘం నెల్లూరు జిల్లా పద్మశాలి సంఘప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. యోగా ప్రతి కుటుంబంలో ఒక భాగం కావాలని యోగ సాధన చేయడం వల్ల కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని కుటుంబం ఎప్పుడైతే ఆరోగ్యంగా ఉంటుందో అభివృద్ధి వైపు కుటుంబాలు అడుగులేస్తాయని యోగా సాధనలో విద్యార్థుల యొక్క సంపత్తి పెరుగుతుందని ప్రతి ఒక్కరు యోగాను ప్రతిరోజు చేయాలి చేసిన యెడల వారి యొక్క దయను ఎందుకు జీవితం ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటుంది అని ఆయన అన్నారు. మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశంలో గల 29 రాష్ట్రాల్లో యోగా కార్యక్రమాలు ప్రతిరోజు జరగాలని ఆయన స్వయంగా యోగ సాధన చేస్తున్నారని వారి యొక్క స్ఫూర్తిని ప్రతి ఒక్క భారతీయ పౌరుడు తీసుకొని ఆ దిశగా యోగసాధకులుగా తయారవ్వాలని కలెక్టర్ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగా కోసం ఎంతో నడుము కట్టుకొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిని ప్రతి ఒక్కరు ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకొని కుటుంబాన్ని అభివృద్ధి చేసుకొని దేశంలో ఏ మహమ్మారి వచ్చిన ఎదుర్కొనే విధంగా ఆరోగ్య వంతులుగా తయారవ్వాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమ గోపాల్, జిల్లా కార్యదర్శి జానపాటి రామసుబ్బయ్య, జిల్లా కమిటీసభ్యులు చేబ్రోలు చంద్ర, జొన్నాదుల రవి, మహిళా అధ్యక్షురాలు సోమ అనురాధ, కోవూరు శ్రీకృష్ణ ధ్యాన యోగ భారతి యోగసాధకులు పాల్గొన్నారు.

## క్రియాశీలక సభ్యత్వాల కిట్ల పంపిణీ




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జిల్లా పరిశీలకుడు అజయ్ కుమార్ ఆదేశాల మేరకు నియోజకవర్గ నాయకులు భోగినేని కాశీరావు, కొట్టె వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని జనసైనికులకు క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 4వేల మందికి సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సభ్యత్వాల నమోదులో జిల్లాలో ఉదయగిరి నియోజకవర్గం మూడో స్థానంలో నిలిచిందన్నారు. క్రియాశీలక సభ్యత్వం ఉన్నవారికి రూ.5లక్షల బీమా, రూ.50 వేలు ప్రమాద బీమా కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయ కులు సురేంద్ర రెడ్డి, బండారు సత్యనారాయణ, అలూరి రవీంద్ర, పెట్లు కిరణ్, నాయబ్ రసూల్, రవికుమార్, కె.శ్రీనివాసులు, రామవేంద్ర, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దార్లు, ఆపరేటర్లు, రాజకీయ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 2.41.44 మంది ఓటర్లు ఉండగా 323 పోలింగ్ బూత్లు కలవన్నారు. ఓటర్ల చేర్పులు, మార్పులతోపాటు చనిపోయిన వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో సుభద్ర, పలు మండలాల తహసీల్దారులు, రాజకీయ పార్టీల నాయకులు బయ్యన్న, బొజ్జా నరసింహులు, గడ్డం వెంకటేశ్వర్లు, నల్లిపోగు నరసింహా, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎం సహాయనిధి

### ▶ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 20 మందికి మంజూరైన రూ.19లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అందజేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలు పొందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమన్నారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉదారంగా సాయం మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్ఎంయూ నూతన కమిటీ ఎంపిక



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ఆర్టీసీ డిపో నేషనల్ మజూర్ యూనిటీ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడిగా షేక్ రియాజ్, ముఖ్య సలహాదారుడిగా ఎం.వెంకటేశ్వర్లు, చైర్మన్గా బీ.నాగరాజు, అధ్యక్షుడిగా సీహెచ్ వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్గా ఆర్కే విశ్వనాథ్, కార్యదర్శిగా శంకర్లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం నూతన కమిటీని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రేపే.. హనుమజ్జయంతి

▶ శ్రీరామ భక్త పరాయణునీ జన్మదినోత్సవం ▶ హనుమజ్జయంతి సందర్భంగా చిరు కథనం

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** హనుమాన్ జయంతిని హనుమాన్ జన్మ దినోత్సవం అని కూడా పిలుస్తారు. హనుమంతుడు శ్రీమహా విష్ణువు అవతారమైన శ్రీరాముని యొక్క భర్త పరాయణుడిగా పరిగణించబడ్డాడు. అతని అచంచలమైన భక్తికి విస్తృతంగా ప్రసిద్ధి చెందాడు అతను బలానికి చిహ్నంగా గౌరవించబడ్డాడు. చెడుపై విజయం సాధించి రక్షణ కల్పించే సామర్థ్యం ఉన్న దేవునిగా హనుమంతుని పూజిస్తారు. ఈ పండుగ రోజున హనుమంతుని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. అతని రక్షణ ఆశీర్వాదాలను కోరుకుంటారు. దేవాలయాలకు వెళ్లి ఆయనను పూజిస్తారు. ఆయనను పూజించే భక్తులు హనుమాన్ చాలీసా, రామాయణం అంటే పురాణ గ్రంథాల నుండి చదువుతారు భక్తులు దేవాలయాలను సందర్శించి హనుమంతుని మూర్తి నుండి ఆయన నుదుటిపైనున్న సింధూరాన్ని పూసుకుంటారు. పురాణాల ప్రకారం హనుమంతుడు సీత తన నుదుట్టిపై సింధూరం పూసుకున్నట్లు కనుగొన్నప్పుడు అతను ఆచారాన్ని గురించి తెలుసుకుంటాడు అలా చేయడం వల్ల తన భర్త రామునికే దీర్ఘాయుష్షు లభిస్తుందని ఆమె సమాధానమిచ్చింది. అప్పుడు హనుమంతుడు తన శరీరం అంతా సింధూరం పూసుకున్నాడు తద్వారా రామునికి అమరత్వాన్ని నిర్ధారిస్తాడు అలాగే హనుమంతుడిని మనసులో ఉంచుకొని ధ్యానం చేసే వ్యక్తికి బజరంగబలి ఆశీస్సులు ఎల్లప్పుడూ లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. వారి జీవితంలోని అన్ని కష్టాలు, సమస్యలు తొలగిపోయి వివిధ అద్భుతాలు దారితీస్తాయని భక్తుల నమ్మకం.



## హనుమంతుని జన్మ వృత్తాంతం

ఒకనాడ అంజీర అను గొప్ప సాధువు ఇంద్రుడు వద్దకు వెళ్లాడు ఇంద్రుడు నత్తకితో అంజీరాకు స్వాగతం పలుకుతాడు. ముత్యాన్ని చూడడం ఇష్టం లేని సాధువు పరమాత్ముని ధ్యానంలో లీనమయ్యాడు. ఈ విషయం గమనించని ఇంద్రుడు, నర్తకి నృత్యం ఎలా ఉందని ప్రశ్నించారు. తాను పరమాత్ముని ధ్యానంలో ఉన్నట్లు గ్రహించారు దీంతో నృత్యకారిణి అవమానంగా భావించి నిరోత్సాహంతో అంజీరాను దుర్భాషలాడి అవమానిస్తుంది. కోపోద్రిక్తుడైన అంజీర నీవు స్వర్గం నుంచి భూమికి పోతావు ఆడ కోతివై పుట్టి కొండలలో ఉన్న అడవుల్లో జీవిస్తామని శపిస్తాడు వెంటనే నర్తకి క్షమాపణలు చెప్పి క్షమాభిక్ష వేడుకొంది. శాంతించిన అంజీర నీకు పరమాత్ముని ఆరాధించే గొప్ప భక్తుడు పుత్రునిగా జన్మిస్తాడు. ఎప్పుడూ పరమాత్ముని సేవలోనే ఉంటాడని ఉపశమనం కల్పిస్తాడు. నృత్యకారిణి వానర రాజైన కుంజరకు కుమార్తెగా జన్మిస్తుంది తరువాత కుంజర ప్రవతసుడైన కేసరిని వివాహమాడి మహిమాన్విత గుణసంపన్నుడైన, శ్రీరామ భక్తుడైన హనుమంతునికి శివ వాయుదేవుల ఆశీస్సులతో జన్మనిచ్చింది.

## హనుమంతుని స్వామి భక్తి

హనుమంతుడు అనంత శక్తి పరాక్రమవంతుడైనప్పటికీ శ్రీరాముని సేవలో గడపడానికే అత్యంత ప్రాధాన్యత ఇచ్చాడు. శ్రీరామునికి తన మనసే మందిరంగా చేసి కొలిచిన హనుమంతుడు తన గుండెను చీల్చుకోపగా సీతారాముల దర్శనం ఇచ్చారంటే అది హనుమంతుని స్వామి భక్తికి పరాకాష్ట కావున భక్తాదులు హనుమత్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకొని ఆయన ఆశీస్సులు పొందాలని ఆశిద్దాం.

# యోగాపై అవగాహన కల్పించండి : జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో రాబోయే నెల రోజులపాటు యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములు చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా చేపట్టాల్సిన యోగా అవగాహన కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొననున్న నేపథ్యంలో, యోగా ప్రాధాన్యతను ప్రజలందరికీ తెలిసేలా జిల్లావ్యాప్తంగా యోగా అవగాహన కార్యక్రమాలు నేటి నుంచి జూన్ 21 వరకు షెడ్యూలు ప్రకారం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, జడ్పీ సీఈవో, డిఎం అండ్ హెచ్వో, ఆయూష్ శాఖల అధికారులు 30 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించేలా షెడ్యూలు తయారు చేయాలన్నారు. ఎంపీడీవోలు అందరూ మండల స్థాయిలో ఒక ప్రత్యేక యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. గ్రామపంచాయతీ స్థాయిలో కూడా స్థానిక ప్రజలకు యోగా ప్రాధాన్యతను వివరించాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు అందరూ వారి శాఖల పరిధిలో సిబ్బందికి కూడా అవగాహన కల్పించేలా యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ యోగా అవగాహన కార్యక్రమాల్లో తప్పకుండా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలో 30 రోజులపాటు యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ప్రతి ఒక్కరిని కూడా కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఖాళీ స్థలాల్లో చెత్తను వెంటనే తొలగించండి : హెల్త్ ఆఫీసర్

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం స్థానిక 18వ వార్డులో పర్యటించారు. ఖాళీ స్థలాల్లో ఎక్కువ చెత్త పేరుకొని పోయి ఉండడం గమనించారు. కాలువల్లో పూడిక సరిగ్గా తీయక దోమల వ్యాప్తికి కారణం అవుతున్న సెక్రటరీ, ఆప్కాస్ మేస్త్రీలుగా వ్యవహరిస్తున్న ముగ్గురికి నోటీసులు ఇవ్వడం జరిగింది. ప్రతిరోజు తమ తమ వార్డుల్లో పర్యటించి ప్రజలతో మమేకమై వారి వారి పారిశుద్ధ్యనికి సంబంధించిన సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ఆయా సెక్రటరీలు ఇన్స్పెక్టర్ల మీదే ఆధారపడి ఉంటుందని తెలియజేశారు. రెండు రోజులు సమయం ఇచ్చి




ఆ 18వ వార్డుకు సంబంధించిన పారిశుద్ధ్యనికి సంబంధించిన కాలువలలో పూడిక, ఖాళీ స్థలాల్లో చెత్తను వెంటనే తీసివేయవలసిందిగా సూపర్వైజర్ ను ఆదేశించారు.

# విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ప్రారంభం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోనే తిరుమల నగర్ నందని బట్టువారిపాలెం గ్రామ రహదారి ప్రక్కన నిర్మాణం చేసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఆలయ నిర్వాహకులు జి.శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు పర్యవేక్షణలో ఉదయాన్నే ఆలయ శుద్ధి గణపతి పూజ పుణ్యాహ వచనం షోడశోపచారాలు తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం గణపతి హోమం తదితర హోమాధులను జరిపించారు. భక్తులు హాజరై స్వామి వారి కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల భక్తులు హాజరయ్యారు.

## కార్పొరేషన్‌లో ప్రక్షాళన..

# పలువురుకి ఆర్ఐలుగా అవకాశం



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ నగరపాలక సంస్థలో ప్రక్షాళన చేపట్టారు. అందులో భాగంగా నగరపాలక సంస్థలో పలువురుని పలు విభాగాలకు బదిలీ చేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా ఉన్న వంశీనాథ్‌రెడ్డి, సందిప్‌లను మరో విభాగానికి బదిలీ చేశారు. వంశీనాథ్ జూనియర్ అసిస్టెంట్‌ను జిఎస్‌డబ్ల్యూ ఎస్‌హెచ్ 1 విభాగానికి, జూనియర్ అసిస్టెంట్ సందిప్‌ను టౌన్ ప్లానింగ్‌లోని జి4 విభాగానికి బదిలీ చేశారు. అదేవిధంగా జిఎస్‌డబ్ల్యూ ఎస్‌హెచ్ 1 విభాగంలో సినియర్, జూనియర్ అసిస్టెంట్లులుగా ఉన్న ఎల్ పి.వర ప్రసాద్, సిహెచ్ రవిలను రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా, టౌన్ ప్లానింగ్ విభాగంలో జి4, పబ్లిక్ హెల్త్ విభాగంలో ఎఫ్3గా ఉన్న వై.శ్రీనివాసులు, పి.శీనయ్యలను, హౌసింగ్ ఫర్ ఆల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సీవీఎస్ కిరణ్‌లను రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లుగా నియమిస్తూ కమిషనర్ వైవో నందన్ ఉత్తర్వులు జారీచేశారు. మెప్మా విభాగంలో సినియర్ అసిస్టెంట్‌గా ఉన్న బాల సుబ్రహ్మణ్యంను అదే విభాగం సూపరింటెండెంట్‌గా నియమించారు. నగరపాలక సంస్థలో డబ్ల్యూఎస్‌లో ఉన్న జి.జాషువా, డి.భాస్కర్, టి.తిరుపతయ్య, ఎన్.అనిత కుమారి, బిల్ కలెక్టర్లను రెవెన్యూ విభాగం ఎసెక్షన్‌కు బదిలీ చేశారు. బిల్ కలెక్టర్లైన కె.హరిష్, మౌలిక శ్రీదేవీలను నగరపాలక సంస్థలోని సెక్రటరీ వద్ద రిపోర్ట్ చేసుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ పేషీకి కె.సాయి చరణ్ అనే జూనియర్ అసిస్టెంట్‌ను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.

# విద్యార్థులను అభినందించిన జడ్పీ చైర్ పర్సన్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా ఎంఎస్‌పి ట్రైనింగ్ పొందుటకు ఆరు నెలలు పాటు ట్రైనింగ్‌లో పాల్గొన్న ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీలు ట్రైనింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నందు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మంగళవారం విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ విద్యా రమ, డిప్యూటీ సీఈవో మోహన్ రావు కార్యాలయ ఏఓ కొండయ్య సిబ్బంది పాల్గొన్నారు.